నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
nipuna
Every Wednesday Free Suppliment
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
19 జూన్ 2024
పేజీలు 8




# కాలేజీ, బ్రాంచ్ ఎంపిక ఎలా?



రాష్ట్రంలో ఇంజినీరింగ్ ఎంట్రన్స్ (టీఎస్ ఎప్‌సెట్) ర్యాంకులు వెలువడ్డాయి. మరో వారం రోజుల్లో కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానున్నది. ఈ నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు.. కాలేజీ ఎంపిక ఎలా ? బ్రాంచ్ ఎంపిక ఎలా అనే విషయంపై రకరకాల సందేహాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇంజినీరింగ్ రంగంలో నిపుణులు ఇచ్చిన సూచనలు సంక్షిప్తంగా....

**ఐఐటీల వివరాలు 4,5,6 పేజీల్లో**

### ఇంజినీరింగ్ కాలేజీ ఎంపిక ఎలా?

- ఇంజినీరింగ్ అనేది ఎవర్‌గ్రీన్ ప్రొఫెషనల్ కోర్సు. ఈ కోర్సు సమయం జీవితంలో స్థిరపడటానికి చాలా కీలకమైనది. ఇంజినీరింగ్ నాలుగేండ్లు పూర్తయిన తర్వాత ఎక్కువమంది ఆయా రంగంలో స్థిరపడుతుంటారు. జీవితాన్ని ప్రభావం చేసే ఈ నాలుగేండ్లు ఎక్కువ సమయం గడిపే కాలేజీ ప్రభావం చాలా ఉంటుంది. కాబట్టి కాలేజీలో ప్రాథమికంగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఫ్యాకల్టీ, ల్యాబ్, లైబ్రరీతోపాటు ఏఐసీఈటీ, న్యాక్, ఎన్‌బీఏ, యూనివర్సిటీ/అటానమస్ తదితర గుర్తింపులను ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవాలి. వీటితో పాటు ఇండస్ట్రీతో కాలేజీలకు ఉన్న ఎంవోయూలు, కొన్నేండ్లుగా విద్యార్థులకు వస్తున్న ఇంటర్న్‌షిప్స్, ప్లేస్‌మెంట్స్‌పై కాలేజీ వెబ్‌సైట్స్‌లో వివరాలను పరిశీలించాలి. వీటన్నింటి ఆధారంగా కాలేజీని ఎంపిక చేసుకోవాలి.

### బ్రాంచ్ ఎంపిక ఎలా?

- దీనిలో ఒకప్పుడు కోర్ బ్రాంచీలు మాత్రమే ఉండేవి. కాలానుగుణంగా అనేక కొత్త బ్రాంచీలు వచ్చాయి. సుమారు 50 రకాల బ్రాంచీలు ప్రస్తుతం ఉన్నాయి. వీటిలో ఏది తీసుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుంది అనే విషయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు మూస ధోరణిలో ఆలోచించకుండా పీర్ గ్రూప్ లేదా సొసైటీ ఇన్‌ఫ్లూయెన్సీతో బ్రాంచీలను ఎంపిక చేసుకోకూడదు.
- విద్యార్థులకు ఆయా సబ్జెక్టుల్లో ఉండే పట్టు, ఆసక్తిని బట్టి తీసుకుంటే మంచిది. దీంతో పాటు భవిష్యత్తులో ఏ రంగంలో స్థిరపడాలనుకుంటున్నారనే దానికి అనుగుణంగా కూడా బ్రాంచీని ఎంపిక చేసుకోవాలి.

### సీఎస్ఈ & అనుబంధ బ్రాంచీల్లో ఏది తీసుకోవాలి?

- నాలుగేండ్లుగా కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో అనేక కొత్త బ్రాంచీలను రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కాలేజీలు ఆఫర్ చేస్తున్నాయి. అయితే వీటిలో దేన్ని ఎంపిక చేసుకోవాలనే దానిపై అనేక సందేహాలుంటాయి. వాస్తవానికి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ)కి, ఐటీ, డేటాసైన్స్, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్‌చైన్, ఏఐ అండ్ ఎంఎల్ తదితర బ్రాంచీల మధ్య వ్యత్యాసాన్ని పరిశీలిస్తే మొదటి రెండేండ్లు సిలబస్ సీఎస్ఈ, అనుబంధ బ్రాంచీలకు సమానం. తర్వాత మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ నుంచి ఆయా స్పెషలైజేషన్లకు సంబంధించిన అంశాలపై సిలబస్‌ను రూపొందించారు. అంటే దాదాపు 70 శాతం పైగా సిలబస్ సమానం. కాబట్టి వీటిలో మీ ర్యాంక్ ఆధారంగా ఏది వచ్చినా తీసుకోవచ్చు. ప్లేస్‌మెంట్స్‌లో అందరికీ దాదాపు సమాన అవకాశాలు ఉంటాయని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.
- చాలామంది సీఎస్ఈ రావట్లేదని బాధపడుతుంటారు. కానీ నిజానికి అందరికీ సీఎస్ఈ కావాలనుకోవడం ఒక మూస ధోరణి. నిజానికి అంతకంటే ఎక్కువ డిమాండ్ కలిగిన కోర్ బ్రాంచీలు ఉన్నాయి. సివిల్, ఎలక్ట్రికల్, ఈసీఈ, మెకానికల్, మెటలర్జీ, కెమికల్ ఇంజినీరింగ్‌ల్లో కూడా చక్కటి అవకాశాలు ఉన్నాయి.
- ముఖ్యంగా కోర్ బ్రాంచీల్లో చదివిన వారికి మొదట్లో వేతనం/ ప్యాకేజీలు తక్కువగా కనిపించినా అనుభవం గడించే కొద్ది అవకాశాలు, జీతభత్యాలు సాఫ్ట్‌వేర్లను మించి పోతున్నాయనడంలో అతిశయోక్తి లేదు. పీఎస్‌యూలు, మహారత్న, నవరత్న, మినీరత్న వంటి కంపెనీలతో పాటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాల్లో కూడా కొలువులు వస్తాయి.
- మెటలర్జీ, కెమికల్ వంటి బ్రాంచీలు తీసుకున్నవారికి కూడా మంచి ప్లేస్‌మెంట్స్ వస్తున్నాయి. అంతేకాకుండా పీ.ఎస్.యూల్లో కొలువులు సాధిస్తున్నారు.
- యూపీఎస్సీ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా నిర్వహించే పరీక్షల్లో కూడా ఎక్కువగా సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ బ్రాంచీలకు సంబంధించిన పోస్టులు మాత్రమే ఉంటాయనేది వాస్తవం. కాబట్టి విద్యార్థి, తల్లిదండ్రులు అన్ని అంశాలను గమనించి, అవసరమైతే ఆయా కాలేజీలు, ఆయా బ్రాంచీలు చదువుతున్న వారి వద్దకు వెళ్లి సలహాలు, సూచనలు తీసుకుని బ్రాంచీ ఎంపిక చేసుకోవడం ఉత్తమం.